ప్రజాశక్తి
ఆదివారం 21 జనవరి 2024 | 5 | అనంతపురం

బాధ్యతలు స్వీకరిస్తున్న విసి శ్రీనివాసరావు

# మంత్రి పెద్దిరెడ్డికి నిరసన సెగ

మంత్రి పెద్దిరెడ్డికి సమస్యలను తెలిపేందుకు వెళ్తున్న అంగన్‌వాడీలను అడ్డుకుంటున్న పోలీసులు

◆ ఉరవకొండలో అడ్డగించిన అంగన్‌వాడీలు
◆ కారు కూడా కిందకు దిగని మంత్రి
◆ సిపిఎం నాయకుల అరెస్టు
◆ పోలీసుల తోపులాటలో స్పృహతప్పిన అంగన్‌వాడీ కార్యకర్త

**ప్రజాశక్తి-ఉరవకొండ**

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు 40 రోజులుగా వివిధ రూపాల్లో నిరసనలు తెలుపుతున్నారు. ప్రజాప్రతినిధులను కలిసి సమస్యలను విన్నవించే ప్రయత్నం చేశారు. అయినా ప్రభుత్వం నుంచి స్పందన రావడం లేదు. ఇందులో భాగంగా అనంతపురం జిల్లా ఉరవకొండలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కాన్వాయ్‌ను శనివారం ఉదయం అడ్డగించారు. ఈ నెల 23వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఉరవకొండలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో పర్యటన ఏర్పాట్ల పరిశీలన నిమిత్తం పెద్దిరెడ్డి ఉరవకొండకు విచ్చేశారు. ఈ విషయం తెలుసుకున్న అంగన్‌వాడీలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ప్రధాన రోడ్డుపై బైఠాయించి మంత్రి కాన్వాయ్ వెళ్లకుండా దాదాపు అరగంట పాటు నిరసన తెలిపారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వీరికి సిపిఎం ఉరవకొండ మండల కన్వీనర్ మధుసూదన్, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి చెన్నారాయుడులు మద్దతుగా నిలిచారు. ఓ వైపు అంగన్‌వాడీలు నిరసన తెలుపుతున్నా మంత్రి కనీసం కారు నుంచి కిందకు కూడా దిగలేదు. వారి సమస్యలను వినే ప్రయత్నం చేయలేదు. అంగన్‌వాడీలు మంత్రి వద్దకు వెళ్లి తమ సమస్యలను తెలిపేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తల మధ్య తీవ్ర స్థాయిలో తోపులాట జరిగింది. తోపులాటలో అంగన్‌వాడీ కార్యకర్త జ్యోతి సొమ్మసిల్లి కింద పడిపోయింది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు అంగన్‌వాడీలకు మద్దతుగా నిలిచిన సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్నరాయుడులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. రోడ్డుపై బైటాయించిన అంగన్‌వాడీలను బలవంతంగా పక్కకు నేట్టేసి మంత్రి కాన్వాయ్‌ను ముందుకు పంపారు. పోలీసులు లాగిపడేసి క్రమంలో 8 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు గాయాలు అయ్యాయి. సమస్యలను వినే ప్రయత్నం కూడా చేయని మంత్రి పెద్దిరెడ్డి తీరుపై అంగన్‌వాడీలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి పర్యటన ముగిసిన అనంతరం అరెస్టు చేసిన సిపిఎం,సిపిఐ నాయకులను సొంత పూచీకత్తుపై పోలీసులు విడుదల చేశారు.

స్పృహ తప్పి కింద పడిపోయిన అంగన్‌వాడీ కార్యకర్త

**సమస్యలను వినే ఓపిక లేదా..?**
**మంత్రిపై సిపిఎం ఆగ్రహం**

'అంగన్‌వాడీలు 40 రోజులుగా వారి న్యాయమైన సమస్యల పరిష్కారం కోసంసమ్మె చేస్తున్నారు.. ఇలాంటి సమయంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వారి సమస్యలను వినే ప్రయత్నం కూడా చేయకుండా నిర్లక్ష్యంగా వెళ్లిపోవడం అత్యంత దుర్మార్గమైన చర్య' అని సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్నరాయుడులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టు సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం మొండి వైఖరి అవలంభిస్తోందన్నారు. అంగన్వాడీలు మహిళలను అని చూడకుండా ఉరవకొండలో మంత్రి ఎదుటనే పోలీసులు వారి లాగిపడేశారన్నారు. పురుష పోలీసులు బలవంతంగా ఎక్కడపడితే అక్కడ చేతులు వేసి లాగేయడం నీచమైన చర్య అన్నారు. పోలీసులు ప్రభుత్వానికి వత్తాసు పలికి ఇలా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. అంగన్‌వాడీలపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, సిపిఎం నాయకులు శీనప్ప, అంగన్వాడీ యూనియన్ నాయకులు విజయ, అరుణకాంతమ్మ, దుర్గాదేవి, శ్వేత, ధనలక్ష్మి, సరోజమ్మ, రామజినమ్మ, వరలక్ష్మి, రంగమ్మ, లోకమ్మ, శివశ్రీ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

## జెఎన్‌టియు విసి బాధ్యతల స్వీకరణ

◆ యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తా
◆ నూతన విసి జివిఆర్.శ్రీనివాసరావు

**ప్రజాశక్తి-అనంతపురం**

అనంతపురం జెఎన్‌టియు నూతన ఉపకులపతిగా ఆచార్య జివిఆర్.శ్రీనివాసరావు శనివారం ఉదయం వర్సిటీ పరిపాలనా భవనంలోని ఉపకులపతి ఛాంబర్ బాధ్యతలు స్వీకరించారు. యూనివర్సిటీ అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు సమక్షంలో ఆయన బాధ్యతల చేపట్టారు. అంతకుముందు ఆయనకు వర్సిటీ పరిపాలన భవనం వద్ద రిజిస్ట్రార్ సి.శశిధర్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఎన్‌సిసి విద్యార్థుల గౌరవవందం సమర్పించారు. అక్కడే ఉన్న సరస్వతి విగ్రహానికి పూలమాల వేసి పరిపాలన భవనంలోకి కుటుంబ సభ్యులతో కలిసి నూతన విసి ప్రవేశించారు. తన కార్యాలయంలో వేద పండితులు ఆశీస్సులు తీసుకుని బాధ్యతలు చేపట్టారు.

**యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తాం**

జెఎన్‌టియు అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని నూతన విసి శ్రీనివాసరావు తెలిపారు. బాధ్యతల స్వీకరణ అనంతరం అనంతరం ఆయన మాట్లాడుతూ వర్సిటీ అభివద్ధికి ప్రతి ఉద్యోగి తోడ్పాటును అందించాలని కోరారు. రాబోవు కాలంలో యూనివర్సిటీని మరింత ఉన్నత స్థానానికి తీసుకెళ్లడానికి తగిన కషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎం.విజయ కుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, వర్సిటి డైరెక్టర్లు వి.సుమలత, ఇ.కేశవ రెడ్డి, కిరణ్మయి, సి.శోభాబిందు, పద్మ సువర్ణ, ఎ.సురేష్ బాబు, బి.ఈశ్వర్ రెడ్డి, ఎన్.విశాలి, విబి.చిత్ర, పి.సుజాత, జివి.సుబ్బారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణకాంతి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ బి.చంద్ర మోహన్ రెడ్డి, వర్సిటీ పిఆర్ఒ డాక్టర్ ఎం.రామ శేఖరరెడ్డితో పాటు వివిధ విభాగాల అధిపతులు లు, భోధన,బోదనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## జెఎన్‌టియు, ఎస్‌కెయు విసిలకు సన్మానం

**ప్రజాశక్తి-అనంతపురం**

నూతనంగా బాధ్యతలు చేపట్టిన అనంతపురం జెఎన్‌టియు విసి జివిఆర్ శ్రీనివాసరావు, ఎస్‌కెయు విసి కె.హుస్సేన్‌రెడ్డిని రాధా ప్రింటర్స్ మేనేజింగ్ డైరెక్టర్ టి.ప్రసాదరావు ఘనంగా సన్మానించారు. ఈమేరకు శనివారం జెఎన్‌టియు, ఎస్‌కెయుల్లో వేర్వేరుగా విసిలను కలిసి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేవంత్, మురళీధర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కెయు విసికి ఫొటో అందజేస్తున్న రాధా ప్రింటర్స్ ఎండి ప్రసాదరావు

## ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

**జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి**

సభాస్థలి ప్రాంతాన్ని పరిశీలిస్తున్నమంత్రి పెద్దిరెడ్డి తదితరులు

**ప్రజాశక్తి-ఉరవకొండ**

ఈ నెల 23వ తేదీ ముఖ్యమంత్రి ఉరవకొండలో పర్యటిస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఉరవకొండ పట్టణంలోని అనంతపురం రోడ్ లోని భారత్ పెట్రోలియం వద్ద ఏర్పాటు చేస్తున్న సభాస్థలి, హెలీప్యాడ్ ఏర్పాటు కోసం ఉరవకొండ పట్టణంలోని డిగ్రీ, జూనియర్ కళాశాలల మైదానాలను పరిశీలించారు. అనంతరం తొగటవీర క్షత్రియ కళ్యాణమండపంలో అధికార యంత్రాంగంతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ ఎం.గౌతమి, ముఖ్యమంత్రి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ తలశిల రఘురాం, రాష్ట్ర ఎపిఐఐసి ఛైర్‌పర్సన్ మెట్టు గోవిందరెడ్డి, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీలు మంగమ్మ, శివరామిరెడ్డి, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ, ఉన్నత విద్యా మండలి సలహాదారులు ఆలూరు సాంబశివరెడ్డి, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఈనెల 23వ తేదీన వైఎస్సార్ ఆసరా నిధులను జమ చేసేందుకు ఉరవకొండ రానున్నారన్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను జాగ్రత్తగా చేయాలన్నారు. కార్యక్రమానికి వచ్చే వారు ఇబ్బంది పడకుండా భోజనం,స్నాక్స్,తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. డీఆర్డీఏ, మెప్మా అధికారులు ముందస్తు చర్యలు తీసుకుని కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనేందుకు అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ ఎం.గౌతమి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. ఎమ్మెల్సీ శివరామిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమాన్ని ఎలాంటి ఇబ్బంది లేకుండా నిర్వహించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వేలాది మంది మహిళలు, ప్రజలు గ్రామీణ ప్రాంతాల నుంచి సమావేశానికి వస్తున్నారన్నారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎడిసిసి బ్యాంక్ ఛైర్‌పర్సన్ లిఖిత, ఆర్టీసీ రీజనల్ డైరెక్టర్ మంజుల, అడిషినల్ ఎస్పీ విజయభాస్కర్ రెడ్డి, గుంతకల్లు ఆర్డీవో వి.శ్రీనివాసులు రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చిరుధాన్యాల ప్రాధాన్యత తెలియజేద్దాం

◆ ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ ◆ 'అనంత'లో ప్రారంభమైన చిరుధాన్యాల పండుగ

**ప్రజాశక్తి-అనంతపురం**

'ఒకప్పుడు చిరుధాన్యాలను సాధారణంగానే వాడుతూ వచ్చేవాళ్లం.. నేడు అది ప్రత్యేకంగా మారింది... భావి తరాలకు చిరుధాన్యాల ప్రాధాన్యతను తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది' అని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ తెలియజేశారు. 'అనంత చిరుధాన్యల పండుగ' పేరుతో స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా అనంతపురంలో చిరుధాన్యాల పండుగను చేపట్టారు. శనివారం ప్రారంభమైన ఈ చిరుధాన్యల పండుగ సోమవారం వరకు మూడు రోజుల పాటు జరుగనుంది. అనంతపురం ఆర్ట్స్ కళాశాల మైదానంలో ప్రారంభమైన ఈ మేళాను మాంఛో ఫెర్రర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు నగర మేయర్ వసీం, ప్రకృతి వనం ప్రసాద్, ఎఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ వైవి.మల్లారెడ్డి, సీనియర్ జర్నలిస్టు పతంగి రాంబాబు, సిసిడి డైరెక్టర్ తిరిచర్ల శాస్త్రీ, ఎఆర్ఎస్‌కె ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త సహదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాంఛో మాట్లాడుతూ చిరుధాన్యలను చిన్నతనంలో అందరం సాధారణంగా తినే వారమని గుర్తు చేశారు. ఇప్పుడు వాటి వాడకం తగ్గిందని చెప్పారు. ఫాస్టుఫుడ్ కల్చర్ పెరగడంతో చిరుధాన్యాల వాడకం తగ్గిందన్నారు. తద్వారా ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని విచారం వ్యక్తం చేశారు. వచ్చే తరానికి పూర్వపు ఆహార అలవాట్లు, వాటి వల్ల కలిగే ఆరోగ్యం గురించి తెలియజేయాల్సిన అవసరాన్ని గుర్తించి ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మేయర్ వసీం మాట్లాడుతూ ప్రస్తుతం చిన్న వయసు లోనే ఆరోగ్య సమస్యలతో అందరూ బాధ పడుతున్నారని చెప్పారు. షుగర్, బిపి వంటి జబ్బులు తక్కువ వయసులోనే వస్తున్నాయన్నారు. చిరుధాన్యాల వాడకం, ప్రాధాన్యతను అందరికీ తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రకృతివనం ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఉదయం పూట వ్యాయామం చేసినా జబ్బు వచ్చిందా అని ప్రశ్నించే పరిస్థితులొచ్చాయన్నారు. అవే ఆరోగ్య నియమాలన్న విషయం మరచి అనారోగ్య సంకేతాలుగా చూస్తున్నారన్నారు. ముందు నుంచి ఆరోగ్య సూత్రాలు, సమతుల్యత ఆహారం తీసుకుంటే చాలా వరకు జబ్బులను తగ్గించుకోవచ్చన్నారు. ప్రతి కుటుంబంలోనూ తల్లిదండ్రులు చిరుధాన్యాల ద్వారా రుచికరమైన ఆహారం తయారు చేయడం, వాటిని పిల్లలకు అందించడం వంటివి చేయాలని సూచించారు. వైవి.మల్లారెడ్డి మాట్లాడుతూ చిరుధాన్యం వాడకం ద్వారా అటు రైతుకు, ఇటు మన ఆరోగ్యాలు రెండింటికీ ఉపయోగం చేకూరుస్తాయన్నారు. రైతుకు ఆదాయం... మనం ఆరోగ్యం అన్న విషయాన్ని తెలియాజేయాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎఫ్ ఎకాలజీ ప్రతినిధి మురళీకృష్ణ, మీడియా కో ఆర్డీనేటర్ రమేష్ సుసర్ల, జన జాగృతి ప్రతినిధి బలరాం, రెడ్స్ ప్రతినిధి భానుజ, స్వచ్ఛ కుడ్యమ ప్రతినిధి విజయభాస్కర్, సీఆర్డీఎస్ ప్రతినిధి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుకు సంబంధించిన పుస్తకాన్ని విడుదల చేస్తున్న మాంఛో ఫెర్రర్ తదితరులు..

## కార్పొరేషన్‌లో కంప్యూటర్ కష్టాలు

◆ ఇంజనీరింగ్ అధికారుల నిర్వాకం.. సిబ్బందికి కష్టం..! ◆ ధర తగ్గించడంతో కంప్యూటర్ టెండర్లకు మొగ్గుచూపని కాంట్రాక్టర్లు

**ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్**

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో కంప్యూటర్ కష్టాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఇద్దరు ఇంజినీరింగ్ అధికారుల నిర్వాకంతో కంప్యూటర్ కొనుగోలు టెండర్లకు కాంట్రాక్టర్లు రాకుండా ముఖంచాటేసినట్లు తెలుస్తోంది. సాంకేతిక అభివృద్ధితో పనులు జరగాల్సిన సమయంలో అధికారులు కంప్యూటర్లు లేక ఇబ్బందులు పడే పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు మార్కెట్ ధర కన్నా తక్కువ ధరలతో కంప్యూటర్లు కొనుగోలు చేయాలన్న ప్రతిపాదనలు చేశారు. ప్రముఖ కంపెనీల కంప్యూటర్ల ధరలను ఆఫీసు నిర్వహణాధికారి డిఈఈ దాక్షాయిని కంపెనీ ధరలు పేర్కొంటూ ఇచ్చిన కొటేషన్లకు భిన్నంగా ఎస్టిమేషన్లలో ధరలు తగ్గించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుధారాణి సైతం డిఈ సవరించిన కంపెనీ ధరలను మరింతగా తగ్గించారు. అధికారులు నిర్ధేశించిన ధరలతో కంప్యూటర్లు కొనుగోలు చేయలేమంటూ కాంట్రాక్టర్లు, కంపెనీ నిర్వాహకులు చేతులెత్తేశారు. కంప్యూటర్ ధరలను డిఈ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌లు పోటీపడి తగ్గించటం చూస్తే వారు సాంకేతిక విద్యను అభ్యసించారా.. లేక మార్కెట్ ధరలపై అవగాహన లేనివారా అన్న సందేహాన్ని కాంట్రాక్టర్లు వ్యక్తం చేస్తున్నారు. మోడల్ నెంబర్ MFP138 FNW లేజర్ జెట్ ప్రింటర్ కం స్కానర్ బ్యాక్ అండ్ బ్యాక్ ప్రింటింగ్ ధర ఎస్టిమేషన్ ప్రకారం రూ.36,000 ఉండగా దానిని రూ.20,770కు తగ్గించారు. ఎస్ టైప్ ఛైర్స్ ఎస్టిమేషన్ ధర రూ.3800 ఉండగా రూ.3600కు తగ్గించారు. ఈ తగ్గించిన ధరలకు అసెంబుల్డ్ కంప్యూటర్లు కూడా రావంటూ కాంట్రాక్టర్లు చెబుతున్నారు. బదిలీల్లో భాగంగా మూడు నెలలు క్రితం ఇద్దరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కార్పొరేషన్‌కు వచ్చారు. వారికి సరైన గదులు, కంప్యూటర్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ప్రజాశక్తి అధికారులకు కంప్యూటర్ పాట్లు అన్న అంశంపై వరుస కథనాలను ప్రచురించింది. ఎట్టకేలకు అధికారులు స్పందించి నెలన్నర క్రితం కంప్యూటర్ల కొనుగోలుకు టెండర్లను ఆహ్వానించారు. టెండర్లలో పాల్గొనే కాంట్రాక్టర్లు ప్రముఖ కంప్యూటర్ కంపెనీల ధరలతో కొటేషన్లను జతచేసి టెండర్లు దాఖలు చేయడానికి సిద్ధమయ్యారు. తయారైన ఎస్టిమేషన్లలో ఇద్దరు ఇంజినీరింగ్ అధికారులు పోటీ పడి కంప్యూటర్ల ధరల్లో కోత విధించి టెండర్లు పిలిచారు. దీంతో కంగుతున్న కాంట్రాక్టర్లు టెండర్లు దాఖలు చేయలేదు. కాంట్రాక్టర్లు ఎవరూ రాకపోవడంతో మరోసారి షార్ట్ టెండర్ నిర్వహించటానికి అధికారులు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. కంప్యూటర్లు లేకపోవడంతో అభివద్ధి పనుల మెజర్మెంట్ బుక్‌ను తయారుచేసి అప్లోడ్ చేయటానికి అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు వారి సొంత ట్యాబులు తెచ్చుకుని పనులు చేస్తున్నారు. ఓ వైపు సిబ్బంది కంప్యూటర్లు లేక ఇబ్బంది పడుతున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. అనంతపురం కార్పొరేషన్ నూతన కమిషనర్ విధుల్లో చేరకముందు పాత బిల్లులను పాత కమిషనర్‌తోనే ఆమోదింప జేసుకునేందుకు కాంట్రాక్టర్లు పడరాని పాట్లు పడ్డారు. కంప్యూటర్లు అందుబాటులో లేకుండా చేసిన అధికారుల నిర్వాకాలపై పాత కమిషనర్ భాగ్యలక్ష్మి కనీసం చర్యలు చేపట్టకపోగా చోద్యం చూస్తూ ఉండిపోయింది. నూతన కమిషనర్ అయినా ఇద్దరు ఇంజినీరింగ్ అధికారుల నిర్వాకాలపై దృష్టి సారించి పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలని పలువురు కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

సొంత ల్యాప్‌ట్యాప్‌ల ద్వారా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

## పంట నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలి

**ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్**

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

జిల్లాలో ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం ఎపి రైతుసంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023 ఖరీఫ్‌లో రైతులు అప్పు చేసి వేరుశనగ, కంది, పత్తి, ఆముదం, మొక్కజొన్న, కొర్ర, సజ్జ, ఉలవలు, తదితర పంటలు సాగు చేశారన్నారు. అయితే వర్షాలు రాకపోవడంతో ఆయా పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. కనీసం పెట్టిన పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొందన్నారు. ఈనేపథ్యంలో రైతుసంఘాలు పోరాటం చేస్తే ప్రభుత్వం దిగొచ్చి జిల్లాలోని 31 మండలాలకు 28 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిందన్నారు. దీంతో 1,79 లక్షల హెక్టార్లలో రూ.251 కోట్ల పంట నష్టం జరిగినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారన్నారు. అప్పట్లో పంట నష్టపోయిన రైతులందరికీ సంక్రాంతిలోపు పంటనష్ట పరిహారం జమ చేస్తామని ప్రకటించిందన్నారు. అయితే ఇప్పటి వరకూ ఇచ్చిన పాపానపోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే రైతులకు పరిహారం మంజూరు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎపి రైతుసంఘం జిల్లా ఆధ్యక్షులు తరిమెల నాగరాజు, నాయకులు వి.శివారెడ్డి, పోతలయ్య, చెన్నారెడ్డి, నల్లప్ప పాల్గొన్నారు.

## సచివాలయాల తనిఖీ

**ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్**

నగరపాలక సంస్థ పరిధిలోని కోవూర్‌నగర్, అరవింద నగర్ సచివాలయాలను కమిషనర్ మేఘ స్వరూప్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సచివాలయాల్లోని హాజరు పట్టికలు, తనిఖీ రిజిస్టర్, స్పందన రిజిస్టర్, నోటీసు బోర్డుతో పాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కులగణన కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి అర్హులను లబ్ధిదారులుగా చేర్చాలన్నారు. సచివాలయాల్లో పెండింగ్‌లో ఉన్న సేవలను గడువులో పూర్తి చేయాలన్నారు. సాంకేతిక అంశాలపై కార్యాలయం నుంచి నేరుగా సూచనలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కులగణన సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ మేఘ స్వరూప్

# రహదారుల దిగ్బంధం

పామిడిలో నిర్వహించిన అంగన్వాడీల ర్యాలీలో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్

## జిల్లావ్యాప్తంగా అంగన్వాడీల రాస్తారోకోలు
## అడ్డుకున్న పోలీసులు..అరెస్టులు..విడుదల

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అంగన్‌వాడీలకు వేతనాలు పెంపుదల చేయాలని నిరవధిక సమ్మె చేస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరిని నిరసిస్తూ శనివారం హైదరాబాద్, బెంగళూరు జాతీయ రహదారిని కార్మికులు, సిపిఎం, సిఐటియు నేతలు దిగ్బంధించారు. ఇందులో భాగంగా తపోవనం వద్ద కార్మికులు నాయకులు జాతీయ రహదారిపై బైఠాయించారు. గంట పాటు రహదారి దిగ్బంధించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయి అంతరాయం ఏర్పడింది. దీంతో పోలీసులు నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టు అయిన వారిలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, సిపిఎం నగర కార్యదర్శులు వి.రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి, నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజా, మన్నిల రామాంజినేయులు, గోపాల్, శ్రీనివాసులు, తిరుమలేష్, ప్రకాష్ రెడ్డి, ఆజం బాషా, ఆదినారాయణ ఉన్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం నియంతృత్వంగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. 40 రోజులుగా అంగన్‌వాడీ కార్మికులు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తుంటే పట్టనట్లు వ్యవహరించడం అన్యాయంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయమంటే ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం గ్రాడ్యుటి అమలు చేయకుండా, మీనీ వర్కర్లులను మెయిన్ వర్కర్లుగా మారుస్తూ జిఓ ఇవ్వకుండా జాప్యం చేస్తోందన్నారు. నియంతృత్వ ధోరణి, మొండి వైఖరి విడనాడాలని కోరారు, అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు పగలగొట్టడం, ఎస్మా, ప్రకటించడం, తొలగిస్తామని నోటీసులు ఇవ్వడం, బెదిరింపులకు పాల్పడితే భయపడే ప్రసక్తే లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి అంగన్‌వాడీ కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. న్యాయం చేయకపోతే ముఖ్యమంత్రి జిల్లా పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. వీరికి ఎఐటియుసి నాయకులు రాజేష్‌గౌడ్, కృష్ణుడు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు జయభారతి, జమున, అరుణ, రుక్మిణీ, తదితరులు పాల్గొన్నారు.

పామిడి ఆర్టీసీ బస్టాండ్ వద్ద అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శనివారం కూడా కొనసాగింది. ముందుగా అంగన్వాడీలు దీక్షా శిబిరం నుంచి ర్యాలీగా ఎద్దులపల్లి రోడ్డు అంబేద్కర్ సర్కిల్‌కు చేరుకుని మానవహారం ఏర్పాటు చేశారు. వీరికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయానా సిఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు సమ్మె చేపడితే ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం అప్రజాస్వామికమని అన్నారు.ప్రభుత్వం అంగన్వాడీలతో చర్చలు జరిపి సామరస్యంగా సమస్యను పరిష్కరించాల్సిందిపోయి వాలంటీర్ల ద్వారా అంగన్వాడీ సెంటర్లు నడపాలని ఆదేశాలు ఇవ్వడం, బలవంతంగా అంగన్వాడీ సెంటర్లను తెరవడం ఏంటని నిలదీశారు. రాష్ట్ర చరిత్రలోనే మొట్టమొదటిసారి లక్ష మంది మహిళా కార్మికులు 40 రోజులుగా సమ్మె చేయడం చాలా

అనంతపురంలోని తపోవనం వద్ద జతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న సిఐటియు నాయకులు, అంగన్వాడీలు, (ఇన్‌సెట్‌లో) సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

బాధాకరమన్నారు. అలాంటి వారిని తొలగిస్తామని భయభ్రాంతులకు గురి చేస్తూ నోటీసులు జారీ చేయడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో అన్నిపార్టీలనూ కలుపుకుని పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు అనిమిరెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్, మండల కమిటీ సభ్యులు శంకర్, బాబా ఫక్రుద్దీన్, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఉరవకొండతోపాటు వజ్రకరూరు, విడపనకల్లు మండలాల్లో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శనివారం కూడా కొనసాగింది. వీరికి సమ్మెకు ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచి అధికార పార్టీ నాయకుల ఆదేశాలకు తలొగ్గి పోలీసులు అంగన్వాడీలపై విచక్షణా రహితంగా వ్యవహరించడం బాధాకరమనానరు. అంగన్వాడీలు, పోలీసుల మధ్య తోపులాటలో 8 మంది అంగన్వాడీ కార్యకర్తలకు గాయాలు కావడం బాధాకరమన్నారు. మహిళలను ఇబ్బందులకు గురిచేసిన ఏ ప్రభుత్వాలూ మనుగడ సాధించలేదన్నారు. రానున్న ఎన్నికల్లో మహిళలే ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, యూనియన్ నాయకులు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అంగన్వాడీలు శనివారం గుత్తిలో రాస్తారోకో నిర్వహించారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె 40వ రోజుకు చేరుకుంది. సమ్మెకు సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం మల్లేష్, వి.నిర్మల, రైతు సంఘం నాయకుడు బి.రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, ఐద్వా మండల కార్యదర్శి ఎన్.రేణుక మద్దతు పలికారు. ఇందులో భాగంగా స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం నుంచి ప్రజాసంఘాల నాయకులు, అంగన్వాడీలు ప్రదర్శనగా ఎన్టీఆర్ సర్కిల్‌కు చేరుకుకుని బైఠాయించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ నబిరసూల్ ఆందోళనకారులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు ఎస్.రాజా, ఎస్ఎ.మురళి, రవిశంకర్, కె.సూర్యనారాయణ, రైల్వే కాంట్రాక్టు కార్మికుల యూనియన్ నాయకుడు మురళి, అంగన్వాడీ యూనియన్ సెక్టార్ నాయకురాళ్లు కళ్యాణి, పార్వతి, శారద,గంగ, బావమ్మ, శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని తాడిపత్రి–అనంతపురం జాతీయ రహదారిపై అంగన్వాడీలు రాస్తారోకో నిర్వహించారు. వీరికి కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, సిపిఎం మండల కార్యదర్శి ఆర్.కుళ్లాయప్ప, వ్య.కా.సం మండల కార్యదర్శి ఏ.నాగలింగమయ్య, పుల్లయ్య, రైతుసంఘం నాయకులు వెంకటకొండ, సంజీవరెడ్డి, మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి సి.నాగేంద్ర, అంగన్వాడీ యూనియన్ శింగనమల ప్రాజెక్టు కార్యదర్శి కాత్యాయని, ప్రాజెక్టు నాయకులు మండల సెక్టార్ నాయకులు విమల, సుజాత, వెంకటలక్ష్మి, సుభాషిణి, గీత, రత్నమ్మ, లక్ష్మీదేవి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

పుట్లూరు మండల కేంద్రంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శనివారం 40వ రోజుకు చేరుకుంది. వీరికి సిపిఎం జిల్లా నాయకులు ఎస్.సూరి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నాయకురాళ్లు వై.జయలలిత, శశికళ, పి.అనంతలక్ష్మి, ఎం.లక్ష్మీకాంత, పి.శివపార్వతి, ఎస్.కృష్ణవేణి, ఎన్.రమాదేవి, కె.గాయత్రి, ఎం.సుశీల, ఎపి రైతుసంఘం మండల కార్యదర్శి జి.వెంకటచౌదరి, వ్య.కా.సం మండల అధ్యక్షుడు టి.పెద్దయ్య, కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీలు చేపట్టిన సమ్మెలో భాగంగా శనివారం రాయదుర్గంలోని వినాయక కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున మాట్లాడుతూ 40 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టనట్లుగా వ్యవహరించడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు శివ, సిఐటియు నాయకులు మధు, నాగరాజు, శంకర్, బాషా, అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు మేరీ, రాధమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలు చేపట్టిన సమ్మెలో భాగంగా శనివారం మండల కేంద్రంలో రాస్తారోకో చేపట్టారు. వీరికి ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, మండల కార్యదర్శి సుంకన్న, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ నాయకురాళ్లు రమణమ్మ, భారతీయ, ప్రమీల, రత్నమ్మ, రాజేశ్వరి, రాధిక, సుగుణ, కాంతమ్మ, భారతి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు మండల కేంద్రంలోని కళ్యాణదుర్గం–అనంతపురం జాతీయ రహదారిపై అంగన్వాడీలు రాస్తారోకో నిర్వహించారు. వీరికి సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఆర్డీ జిల్లా కార్యదర్శి రామయ్య, మధ్యాహ్న భోజన జిల్లా అధ్యక్షురాలు జయమ్మ, మండల కార్యదర్శి రాము, సిపిఎంఎల్ మండల కార్యదర్శి హనుమంతురాయుడు, అంగన్వాడీ విజయలక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడీలు చేపట్టిన సమ్మెలో భాగంగా శనివారం కళ్యాణదుర్గంలోని టీ సర్కిల్‌లో మానవహారం నిర్మించి నిరసన తెలిపారు. వెంటనే అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

గార్లదిన్నెలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మెలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో మానవహారం ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. వీరికి సిపిఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి నారాయణస్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రంలో మాట్లాడుతున్న నాయకులు

ఉరవకొండలో అంగన్వాడీలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

## నేరాలు ఘోరాలు

### రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

మృతిచెందిన అభిరామ్

**గుత్తి :** మండలంలోని చెర్లోపల్లి గ్రామ సమీపంలో ఉన్న సేవాఘడ్ వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు చెర్లోపల్లి గ్రామానికి చెందిన హరికృష్ణ కుమారుడు అభిరామ్ (14) గుత్తిలోని కోట ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు సెలవులు కావడంతో ద్విచక్ర వాహనం నేర్చుకోవడానికి వెళ్ళాడు. ద్విచక్ర వాహనం నడుపుతూ పాఠశాల ప్రహరీ గోడకు ఢీకొన్నాడు. ప్రమాదంలో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ ఉండగా స్థానికులు ఆ బాలున్ని హుటాహుటిన గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆ విద్యార్థి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఉన్న ఒక కుమారుడు రోడ్డు ప్రమాదంలో మరణించడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### కర్నాటక మద్యం పట్టివేత

**అనంతపురం క్రైం :** ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు కూడేరు ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో మరుట్ల–2, ఉదిరిపికొండ గ్రామాల్లో పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. మరుట్ల–2లో 30లీటర్ల నాటుసారా, ద్విచక్ర వాహనం, ఉదిరిపికొండ గ్రామంలో 20 మద్యం సీసాలు (180 ఎంఎల్) స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ముగ్గురిని వేర్వేరుగా అరెస్టు చేసి రెండు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

## గెలిపించండి..సేవకుడిగా పని చేస్తా
### ఎంపీ తలారి రంగయ్య

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రంగయ్య

ప్రజాశక్తి-కుందుర్పి

ఎమ్మెల్యేగా గెలిపించండి.. సేవకుడిగా పని చేసి చూపుతా' అంటూ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, ఎంపీ తలారి రంగయ్య విజ్ఞప్తి చేశారు. శనివారం మండల పరిధిలని ఎనుములదొడ్డి, తెనగల్లు, కరిగానపల్లి గ్రామ పంచాయతీల్లో మండల కన్వీనర్ సత్యనారాయణ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా తనకు నియోజకవర్గంలో 25వేల మెజారిటీ ఇచ్చారన్నారు. ప్రస్తుతం జరిగే ఎన్నికల్లో కూడా ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థి శంకర్‌నారాయణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం బెంగళూరుకు బస్సు సర్వీసు నడపాలని అపిలేపల్లి సర్పంచి హసీనా అతావుల్లా వినతిపత్రం సమర్పించారు. తర్వాత మాజీ వైస్ ఎంపిపి బి.జీ సోమనాథ్ మృతికి ఆత్మ శాంతి కలగాలని మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు మహాదేవమ్మ, వరలక్ష్మి, జడ్పిటిసి రాధాస్వామి, వైస్ ఎంపిపి భీమిరెడ్డి, కోఆప్షన్ సభ్యులు ముజీవుల, జగన్, గంగాధర, మారుతీశ్వరి రామమూర్తి, కొమ్మ మమత, లలితమ్మ బొమ్మయ్య, గోవిందమ్మ ఓబన్న, మాజీ సర్పంచి సుదర్శన్‌రెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు గోపాల్, బొమ్మలింగ, మార్కెట్ డైరెక్టర్ లింగప్ప, మండల సచివాలయ కన్వీనర్ రాము, మందలపల్లి భీమప్ప, తెనగల్ల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## అనంత టిడిపి టికెట్ ముస్లిములకు కేటాయించాలి

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎంఎ.షరీఫ్‌తో మాట్లాడుతున్న అనంత ముస్లిం నాయకులు

**అనంతపురం కలెక్టరేట్ :** అనంతపురం అర్బన్ టిడిపి టికెట్‌ను ముస్లిం మైనార్టీలకే ఇవ్వాలని 8 ముస్లిం సంఘాల నాయకులు శాసనమండలి మాజీ ఛైర్మన్, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎంఎ.షరీఫ్‌ను కోరారు. శనివారం అనంతపురానికి వచ్చిన షరీఫ్‌ను పలు మైనార్టీ సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా పలు అంశాలను మైనార్టీ సంఘాల నాయకులు షరీఫ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఒక ఎంపీతో పాటు రెండు ఎమ్మెల్యే స్థానాలను మైనార్టీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అందులోనూ అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 70 వేల మందికి పైగా ముస్లింలు ఓటర్లుగా ఉన్నారని తెలిపారు. కావున అనంతపురం అర్బన్ నియోజకవర్గం టిడిపి టికెట్‌ను ముస్లింలకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎంఎ షరీఫ్ ముస్లింలకు తప్పక న్యాయం జరుగుతుందన్నారు.

## అరటి తోట పరిశీలన

రైతుతో మాట్లాడుతున్న ద్విసభ్య కమిటీ సభ్యులు

**పుట్లూరు :** మండల పరిధిలోని కుమ్మనమల గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు ఓబన్న తోటలో గుర్తు తెలియని వ్యక్తులు అరటి గెలలు నరికిన తోటను నియోజకవర్గ టూ కమిటీ సభ్యులు శనివారం పరిశీలించారు. ఇందులో భాగంగా బాధిత రైతులను పరామర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టూమెన్ కమిటీ సభ్యులు ముట్టిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు మాట్లాడుతూ బాధిత రైతులకు అన్నివేళలా అండగా ఉంటామన్నారు. అరటి గెలలు నరకడం పిరికిపంద చర్య అన్నారు. పోలీసులు వెంటనే అరటి గెలలను నరికిన దుండగులను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బుక్కరాయసముద్రం మాజీ జడ్పిటిసి రామలింగారెడ్డి, సుదర్శన్‌నాయుడు, బాలరంగయ్య, శివశంకర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## నాగేంద్రకు గిడుగు సాహితీ పురస్కారం

**అనంతపురం :** యువకవి డాక్టర్ నానీల నాగేంద్రకు గిడుగు జాతీయ సాహితీ పురస్కారం వరించింది. ఈమేరకు ఈనెల 22న హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పురస్కారం అందజేయనున్నట్లు గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్ నిర్వాహకులు, కళారత్న బిక్కి కృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పుట్టపర్తి మండలంలోని పెడపల్లి గ్రామంలో ఈరమ్మ, చిన్న గరుడప్ప దంపతులకు డాక్టర్ నానీల నాగేంద్ర జన్మించాడు. ఈయన ప్రస్తుతం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో అకడమిక్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నారు. గిడుగు జాతీయ సాహితీ పురస్కారానికి ఎంపిక కావడం పట్ల ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి, జి.బాలసుబ్రమణ్యం, డాక్టర్ శాంతినారాయణ, యాములపల్లి నర్సిరెడ్డి, పూజారి ఈరన్న, కె.హరీష్‌కుమార్ తదితరులు అభినందించారు.

**ఒరిజినల్ లింకు డాక్యుమెంట్ పోయినది**

బి.రాఘవేంద్ర రెడ్డి S/o బి.ఎర్రిస్వామి రెడ్డి D.No:11-957, అరవింద్ నగర్, అనంతపురం టౌన్ మరియు జిల్లాకు చెందిన T.S.No:2679, విస్తీర్ణం $12^1/_2$ సెంట్లు ప్లాటు నెం:92, (ప్రస్తుతం డోర్ నెం:11/955 & 11/956) అనంతపురం మున్సిపల్ ఏరియా గిఫ్ట్ డీడ్ నెం:12233/2021 & లింక్ డాక్యుమెంట్ నెం:1882/1978. అనంతపురం టౌన్ కోర్టు రోడ్డు నందు పోయినది. దొరికిన వారు పై అడ్రెస్ నందు అందజేయగలరు. **సెల్:9963025309**

**Before the Hon'ble Permanent Lok Adalat for Public Utility Services, ANANTHAPURAMU, A.P.**
**Permanent Lok Adalat Case No.39/2023**

**Between :**
The Ananthapuram Co-Operative Urban Bank Ltd.Rep.by Chief Executive Officer, D.No.10-446, Subhash Road, Ananthapuram Town- 515001. (A.P)
**...Applicant**

**And**
1) Sri. Nandyala Rajaa Reddy
2) Sri. J.Jagadeesh
**...Respondents**

**Notice to Respondent No.1**

**R.1**:Sri.Nandyala Rajaa Reddy S/o Nandyala Adinarayana Reddy, aged 29 years, Hindu,Cell Point, R/o D.No:12-4-849,Adarsh Nagar, Ananthapuramu Mobile:9949217953

పై నెంబరు కేసులో 1 వ రెస్పాండెంట్ అయిన మీ హాజరు నిమిత్తం 27/02/2024 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. కావున ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైనా ఆక్షేపణలు తెలుపుకొనవలెను.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

**బి.సత్యనారాయణ రెడ్డి,** న్యాయవాది,
అనంతపురం, సెల్:9849665596

**సవరణ**

21/12/2023 వ తేదిన ప్రజాశక్తిలో పబ్లిష్ అయిన ప్రకటనలో బి.భుజంగరావ్ అని పొరపాటున పబ్లిష్ అయినది. వాటిని షేక్ రెప్పల తహసీన్ అని చదువుకొన గలరు.

**ఎ.సురేష్ కుమార్, అడ్వకేట్ అనంతపురం**

## సిఎం పర్యటనను విజయవంతం చేద్దాం : ఎంపిపి

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

ముఖ్యమంత్రి జగన్ ఉరవకొండ పర్యటనను విజయవంతం చేద్దామని విడపనకల్ ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం విడపనకల్ మండల కేంద్రంలో మండల ప్రజాప్రతినిధులు, సీనియర్ వైసిపి నాయకులు ఆధ్వర్యంలో స్త్రీశక్తి భవనంలో పొదుపు సంఘాల మహిళలు, వాలంటీర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్ ఈనెల 23న నాలుగో విడత కింద పొదుపు సంఘాల మహిళల పొదుపు సంఘాల ఖాతాల్లోకి రుణమాఫీ సొమ్మును బటన్ నొక్కి జమ చేయనున్నట్లు తెలిపారు. కావున మహిళలతోపాటు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వాలంటీర్లు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు కరణం భీమిరెడ్డి, ఎంఎల్‌ఓ కుళ్లాయిస్వామి, యువజన విభాగం మండల అధ్యక్షులు దేశాయి సిద్ధార్థ, మాలాపురం రామాంజనేయులు, ఎంపిటిసి తిమ్మరాజు, సచివాలయ కన్వీనర్ నాగరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం జిల్లా కార్యదర్శిగా రాచర్ల

**బెలుగుప్ప :** ఆర్యవైశ్య సంఘం జిల్లా అదనపు కార్యదర్శిగా రాచర్ల మనోజ్‌కుమార్ నియమితులయ్యారు. శనివారం మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో ఈనెల 28న జిల్లాకేంద్రంలోని కెటిఆర్ ఫంక్షన్ హాలులో నిర్వహించనున్న సమావేశానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ముందుగా ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు సిరుగుప్ప వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఆర్యవైశ్య సంఘం అదనపు కార్యదర్శిగా రాచర్ల మనోజ్‌కుమార్‌తోపాటు విద్యా కమిటీ కార్యదర్శిగా వేముల శ్రీనివాసు, ఆర్యవైశ్య మహిళా మండలి జిల్లా ఉపాధ్యక్షురాలుగా మల్లెముల ప్రమీలారాణిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## ఉరవకొండలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్ననాయకులు

**ఉరవకొండ :** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఎదురుగా ఏర్పాటు చేసిన నందమూరి తారక రామారావు విగ్రహాన్ని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందరేశ్వరి, ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, ఆంధ్రప్రదేశ్ కాకతీయ సేవా సమైక్య నాయకులు బెజవాడ వెంకట్రావు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలచిన ఏకైక వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. ముఖ్యంగా ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. అలాంటి ఆయన విగ్రహాన్ని ఉరవకొండలో ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. స్థల దాతలు దగ్గుబాటి సౌభాగ్య, శ్రీరామ్ మాట్లాడుతూ ఉరవకొండలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి తరలివచ్చిన నాయకులతోపాటు అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు స్థానిక టవర్‌క్లాక్ నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు సందిరెడ్డి శ్రీనివాసులు, విగ్రహ దాతలు దగ్గుబాటి యుగంధర్, దగ్గుబాటి చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

## పెద్దిరెడ్డిని కలిసిన ఆలూరు సాంబశివారెడ్డి, వీరాంజనేయులు

**శింగనమల :** ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలించేందుకు వచ్చిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ప్రభుత్వ సలహాదారుతోపాటు నియోజకవర్గ సమన్వయ కర్త వీరాంజనేయులు కలిశారు. శనివారం జిల్లా సరిహద్దులోని మరూరు టోల్‌గేట్ వద్దకు మంత్రి రాగానే పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

# ప్రాజెక్టులు ముందుకు సాగేనా..?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర విభజన సమయంలో వెనుకబడిన జిల్లాలకు ఇచ్చిన హామీల అమలు ఎంత వరకూ అన్న చర్చ నడుస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈవారంలో సత్యసాయి జిల్లాలో పర్యటించి నాసిన్ అకాడమీని ప్రారంభించారు. తొలిసారిగా ప్రధానిమంత్రి సత్యసాయి జిల్లాకు విచ్చేసిన సందర్భంగా వెనుకబడిన ఈ ప్రాంతానికి ఏమైనా కొత్త ప్రాజెక్టుల గురించిగానీ, పాత హామీల అమలు గురించిగానీ కనీస ప్రస్తావన లేకపోవడం శోచనీయం. ఆయన ప్రసంగా అందరా 'రాముడు' చుట్టూ తిరగడం గమనార్హం. నాసిన్‌ను కూడా విభజన హామీల్లో భాగంగా ఇచ్చారు. 2015 ఏప్రిల్‌లో శంకుస్థాపన చేస్తే పూర్తవడానికి తొమ్మిదేళ్ల పట్టింది. ఈ అకాడమీలో ఐఆర్ఎస్‌తోపాటు కస్టమ్ సంబంధిత అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇస్తారని చెబుతున్నారు. అయితే అకాడమీ నిర్మాణం పూర్తయిందిగానీ విభజన సమయంలో ఇచ్చిన మరిన్ని హామీల అమలు నత్తనడకనే సాగుతున్నాయి. వీటిలో బుక్కరాయసముద్రం మండలం జంతలూరు వద్ద కేంద్రీయ విశ్వవిద్యాలయం నిర్మాణపు పనులు ఇప్పటికీ పూర్తవలేదు. ఇది ప్రారంభమై దాదాపు ఐదేళ్లు దాటుతున్నా ఇప్పటికీ అద్దె భవనాలు, అరకొర వసతులు నడుమ నడుస్తున్నాయి. ఎప్పటికి పూర్తవుతాయన్నది చూడాల్సి ఉంది. ఇక అదే సమయంలో 2015లోనే బెల్ ప్రాజెక్టును కేంద్ర మంత్రి మనోహర్ పారికర్ శంకస్థాపన చేశారు. అది కూడా ప్రహరీలకే పరిమితమైంది. శంకుస్థాపన సమయంలో మంత్రి మనోహర్ పారికర్ ఈ పరిశ్రమనే కాకుండా మరిన్ని యుద్ధ రంగ పరిశ్రమలు ఇక్కడ నెలకొల్పబోతున్నట్టు ప్రకటించారు. కానీ ప్రధాన బెల్ ప్రాజెక్టే 'ఎక్కడ వేసిన గొంగళి' అక్కడే అన్న చందంగా మారింది. ఇక విభజన సమయంలో ఇచ్చిన హామీలో ప్రధానమైనది వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధి కేటాయింపు. ఏడాదికి రూ.50 కోట్ల చొప్పున మూడు సంవత్సరాలు కేటాయించి తర్వాత నిలిపివేసింది. వాస్తవానికి ఈ ప్రాంతానికి బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజీని ఇస్తామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఆ రకమైన నిధుల కేటాయింపులు వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లాకు కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తోందన్న విమర్శలూ వ్యక్తమవుతున్నాయి. ఇకపోతే అంగన్‌వాడీల సమ్మె కొనసాగుతూనే ఉంది. సమ్మె 40 రోజులు దాటినా రాష్ట్ర ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదు. పైగా ఉద్యోగాల నుంచి తొలగిస్తామన్న బెదిరింపులు పెరుగుతున్నాయి. శనివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఉరవకండ పర్యటనలోనూ మంత్రి కాన్వాయ్‌ను అంగన్‌వాడీలు అడ్డుకున్నారు. పోలీసులు వారిని పక్కకు ఇడ్చి పడేశారు. మహిళలు ఇన్ని రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం పట్ల అనేక విమర్శలూ వ్యక్తమవుతున్నాయి. ఈవారంలో చోటు చేసుకున్న ప్రధాన అంశాల్లో వైసిపి అభ్యర్థుల ప్రకటన కొనసాగుతూనే ఉంది. శింగనమల, మడకశిర నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జిలను నియమిస్తూ వైసిపి ప్రకటన జారీ చేసింది. రెండు నియోజకవర్గాలకు కొత్తవారినే నియమించారు.

రాస్తారోకో చేస్తున్న మహిళలు

# నీటికోసం రోడ్డెక్కిన జనం
## కళ్యాణదుర్గంలో ఖాళీ బిందెలతో రాస్తారోకో

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

15 రోజులుగా నీరు సరఫరా కాకపోవడంతో పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీవాసులు శనివారం ఖాళీ బిందెలతో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన జ్యోతి, రమాదేవి, శ్రీలక్ష్మి, గంగమ్మ మాట్లాడుతూ పట్టణంలో తాగునీరు సరఫరా చేయకపోవడంతో బయటి డబ్బులు పెట్టి కొనాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. వచ్చే అరకొర సంపాదనతో నీటిని కొనలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్నారన్నారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి కార్మికులకు వేతనాలు చెల్లించి నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## యుగపురుషుడు ఎన్టీఆర్

**పుట్టపర్తి రూరల్ :** ఎన్టీఆర్ 28వ వర్ధంతి సందర్భంగా శనివారం పెడబల్లి టిడిపి కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ బిసిలకు రిజర్వేషన్లు అమలు చేసి వారిలో రాజకీయ చైతన్యం తీసుకొచ్చిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ విజయకుమార్, నాయకులు పుల్లప్ప, శ్రీరామ్‌నాయక్, బొమ్మయ్య, బత్తలపల్లి మహేష్, శ్రీనివాసులు, ఆకుల కుళ్లాయప్ప పాల్గొన్నారు.

## టిడిపి గుర్తుతో కూడిన జెండా అందజేత

**ఓబుళదేవరచెరువు :** కొండకమర్లకు చెందిన మైనార్టీ కార్యదర్శి గండికోట ఇర్షాద్ టిడిపి యాప్ లో, సోషల్ మీడియాలో యాక్టివ్‌గా పని చేసినందున పార్టీ సెంట్రల్ ఆఫీస్ నుంచి పార్టీ సింబల్‌తో కూడిన జెండా బహుమతిగా రావడంతో శనివారం మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి అందజేశారు. పల్లె మాట్లాడుతూ పార్టీ కోసం ఇలానే పనిచేస్తూ మున్ముందు ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జయచంద్ర, నాయకులు అంజనప్ప, షానవాజ్, అంజన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయం తనిఖీ

**బత్తలపల్లి :** గ్రంథాలయాలను ప్రజలు, పాఠకులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయాన్ని శనివారం ఆమె సందర్శించి రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రజలు ప్రతి రోజూ గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు, దినపత్రికలను చదవాలని సూచించారు. గ్రంథాలయ సెస్సు గురిం చి పంచాయతీ అధికారులతో మాట్లాడారు. సెస్సు కట్టించాలని గ్రంథాలయ అధికారిణి రాజేశ్వరికి సూచించారు.

**ముదిగుబ్బ :** వార్షిక తనిఖీలో భాగంగా గ్రాంథాలయ జిల్లా కార్యదర్శి రమ శనివారం స్థానిక గ్రంథాలయాన్ని సందర్శించి రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. పాఠకులకు నిత్యం అందు బాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మూడే బొజ్జేనాయక్, సిబ్బంది ఖాదర్‌బాషా, పాఠకులు పాల్గొన్నారు

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**హిందూపురం :** పట్టణంలోని కంచి కామాక్షి కల్యాణ మండపంలో శనివారం జెవిఎస్ ఎడ్యుకేషన్ ట్రస్టు అధ్యక్షులు జెఇ వెంకటస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో బెంగళూరు సప్తగిరి అసుపత్రి వైద్యులు అభిషేక్, అధిరాజ్, లిఖిత్‌తో పాటు వైద్య సిబ్బంది 250 మందికి పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. శస్త్ర చికిత్స అవసరం ఉన్న వారికి బెంగళూరు ఆసుపత్రిలో చేస్తామన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు నర్సోజిరావు, శివకుమార్, సెల్ పాయింట్ నురూల్లా, ఉమర్ ఫారూఖ్‌ఖాన్ పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై ర్యాలీ

**హిందూపురం :** ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా పట్టణంలోని సప్తగిరి జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు శనివారం సేవామందిర్‌లో సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ప్రజలకు సీజనల్ వ్యాధులపై వివరించి, జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మంజూనాథ్, ఎఓ గంగిరెడ్డి, అంధుల పాఠశాల ప్రిన్సిపల్ అబ్దుల్ కరీం, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# రజక మహాసభను విజయవంతం చేయండి

పోస్టర్లను విడుదల చేస్తున్న రజక సంఘం నాయకులు

**ప్రజాశక్తి-ఉరవకొండ**

అనంతపురంలోని లలిత కళాపరిషత్‌లో ఈనెల28న నిర్వహించనున్న రజక మహాసభను విజయవంతం చేద్దామని రజక సంఘం రాష్ట్ర నాయకులు కంబన్న పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం గుంత కల్లు రోడ్డులోని గంగమ్మ ఆలయంలో తాలూకా నాయకులు రాజశేఖర్ ఆధ్వర్యంలో రజక సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకులు సామాజిక, సాంఘిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో అభివృద్ధి చెందాలంటే చదువుతోపాటు ఐకమత్యంతోనే సాధ్యమన్నారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని, 50ఏళ్లకు పైబడిన వృత్తిదారులకు పెన్షన్ మంజూరు చేయాలని, రజకులకు రాజకీయ అవకాశం కల్పించాలని, దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలపై చర్చించేందుకు నిర్వహిస్తు న్న మహాసభకు రజక సోదరులందరూ భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం జిల్లా నాయకులు నారాయణస్వామి, తాలూకా నాయకులు రాజశేఖర్, శుభకర్, నాగేష్, రంగన్న, కేసన్న, రామాంజనేయులు, ప్రకాష్, శివన్న, రఘు, ఆంజనేయ, సురేష్, వీరేష్, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## 'ఆడుదాం ఆంధ్ర' విజేతలకు బహుమతులు

క్రీడా కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

**పెద్దపప్పూరు :** మండలం పరిధిలోని స్థానిక జడ్పీహెచ్ పాఠశాలలో ఆడుకుందాం ఆంధ్ర క్రీడాపోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు శుక్రవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిపి రామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చదువులతోపాటు ఆటలు కూడా ముఖ్యమే అన్నారు. ఇందుకోసమే సిఎం జగన్ ఆడుదాం ఆంధ్రా పేరుతో క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రమాదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవిప్రసాద్‌రెడ్డి, ఎంపిడిఒ రామకృష్ణ, సింగిల్‌విండో అధ్యక్షులు అమర్నాథ్‌రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ అమర్నాథ్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, ధర్మాపురం సర్పంచి రమేష్‌నాయుడు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**రాయదుర్గం :** పట్టణంలోని క్రీడాకారులకు ఎపిఐఐసి ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళు శిల్ప శనివారం క్రీడా కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారుల ప్రోత్సాహానికి ప్రభుత్వ చేయూతనిస్తోందన్నారు. ఇందులో భాగంగానే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్లు లావణ్య, శారద, కో ఆప్షన్ సభ్యులు నజీర్, శ్రీనివాసులు, వైసిపి నాయకులు పొరాళు శివ, పట్టణ కన్వీనర్ అరవా శివప్ప, వార్డు ఇన్‌ఛార్జి శ్రీరామిరెడ్డి, నిజాముద్దీన్, కృష్ణమూర్తి, రామాంజనేయులు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్యశిబిరం

**ఆత్మకూరు :** మండల కేంద్రంలోని హైస్కూల్‌లో అబ్బాయి కిడ్నీ కేర్ సెంటర్ ఆసుపత్రి వారు శనివారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నేతృత్వంలో సర్పంచి వరలక్ష్మి పొన్నూరప్ప ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో మండల వ్యాప్తంగా వచ్చిన ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నిఖిల్‌బాబు, ఎంబిబిఎస్ కీర్తన, ఐ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు రోషన్, ఫార్మసీ స్పెషలిస్టు శివసాయి, మేనేజర్ మహేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించాలి

**హిందూపురం :** పట్టణానికి చెందిన క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, కమిషనర్ ప్రమోద్‌కుమార్ సూచించారు. మున్సిపల్ కార్యలయ ఆవరణలో శనివారం నియోజకవర్గ స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు వారు క్రీడా సామగ్రి అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## పలువురు వైసిపిలో చేరిక

**ముదిగుబ్బ :** మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన టిడిపి మాజీ సర్పంచి గంగన్న శనివారం అనుచరులతో కలిసి వైసిపిలో చేరారు. ఆయన మాట్లాడుతూ వైసిపి విధానాలు వచ్చి వైసిపిలో చేరానన్నారు. వారికి ఎమ్మెల్యే కేతిరెడ్డి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

## కాంగ్రెస్ నాయకత్వాన్ని బలపరుద్దాం

**పరిగి :** కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని బలపరిచే విధంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేటి శ్రీధర్ పిలుపునిచ్చారు. ఎపిసిసి అధ్యక్షురాలిగా ఎన్నికైన వైఎస్ షర్మిలను ఇడుపుల పాయలో కలిసేందుకు శనివారం ఉదయం కార్యకర్తలతో కలిసి ఆయన బయల్దేరారు. షర్మిల నాయక త్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఈశ్వరప్ప, రామాంజనేయులు, భాస్కర్‌రెడ్డి, జగన్నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

## సంకల్పానికి అంగవైకల్యం అడ్డుకాదు

**చిలమత్తూరు :** మనో ధైర్యం ఉంటే దేనినైనా సాధించగలమని ఎంపిడిఒ నరేష్‌క్రిష్ణ అన్నారు. సంకల్పం ఉండాలే కానీ శారీరకంగా అంగవైకల్యం కలిగినా ఆందోళన చెందవద్దన్నారు. కొడికొండ చెక్‌పోస్ట్‌లోని సమర్థనం ట్రస్ట్‌లో శనివారం 39వ బ్యాచ్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెంటర్ హెడ్ వెంకటేశ్వర్లు, శిక్షకులు నరసింహమూర్తి, కవిత, శంకర్, ఎర్రిస్వామి, మహేష్ పాల్గొన్నారు.

## జెసి ప్రభాకర్‌రెడ్డికి అడుగడుగునా నీరాజనం

కూలీలతో మాట్లాడుతున్న జెసి ప్రభాకర్‌రెడ్డి

**పెద్దవడుగూరు :** మండలంలో మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకరరెడ్డి చేపట్టిన యువచైతన్య రథం బస్సుయాత్రకు జనం నీరాజనం పలుకుతున్నారు. ఈమేరకు 4వ రోజు శనివారం చిట్టూరు, కండ్లగూడూరు, దిమ్మగుడి, చిన్నవడుగూరు గ్రామాల్లో బస్సుయాత్ర సాగింది. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులు, యువకులతో కలిసి కలివిడిగా మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. చిన్నవడుగూరులో మహిళలు అధిక సంఖ్యలో హాజరై హారతులతో ఘనస్వాగతం పలికారు. కొందరు యవతులు చిందులు వేస్తూ జెసిని ఉత్సాహ పరిచారు. వారి ఉత్సాహాన్ని మరింత రెట్టింపు చేసేందుకు ప్రభాకర్‌రెడ్డి కూడా చిందులు వేయడం కనిపించింది.

## ఎంఆర్‌పిఎస్ మండల కమిటీ ఎన్నిక

**పెద్దవడుగూరు :** ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు ఆదినారాయణ ఆధ్వర్యంలో శనివారం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పూల రంగస్వామి, గౌరవాధ్యక్షుడిగా నారమ్మ, ఉపాధ్యక్షులుగా మద్దిలేటమ్మ, ప్రధాన కార్యదర్శిగా బాలకృష్ణతోపాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు.

## ఉద్యోగోన్నతి పొందిన క్యాషియర్‌కు సన్మానం

ఈశ్వరయ్యను సన్మానిస్తున్న నాయకులు

**బహ్మాసముద్రం :** మండల పరిధిలోని వేపులపర్తి యూనియన్ బ్యాంకులో సబ్ స్టాఫ్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై వెళు న్న ఈశ్వరయ్యను స్థానిక సిబ్బంది శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బ్యాంకు సిబ్బంది మాట్లాడుతూ ఈశ్వర్ 2010లో సబ్ స్టాఫ్‌గా విధులు ప్రారంభించి ఎనలేని సేవలు సేవలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ రాజశేఖర్‌రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ మధు, సబ్ మేనేజర్లు శరత్, రాఘవేంద్ర, రాజు, బ్యాంకు సిబ్బంది రామకృష్ణ, రమేష్, శ్రీకాంత్, ఎంఆర్‌పిఎస్ మండల నాయకులు చెలిమేపల్లి ఆంజనేయులు, మారెన్న, ములకలేడు ఆంజనేయులు, నాగరాజు, యూసఫ్, మాజీ సర్పంచి హనుమంతప్ప, ఎంపిటిసి రుషప్ప, తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాలకు అతీతంగా ఉరవకొండ అభివృద్ధి

హైమాక్స్ లైట్లను ప్రారంభిస్తున్న రాయలసీమ యువజన విభాగం ఇన్‌ఛార్జి ప్రణయ్‌రెడ్డి

**ఉరవకొండ :** రాజకీయాలకు అతీతంగా ఉరవకొండను అభివృద్ధి చేస్తున్నామని రాయలసీమ వైసిపి యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జి వై.ప్రణయ్‌రెడ్డి అన్నారు. పట్టణ శివారులో రాయంపల్లి సర్కిల్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన అధునాతన హైమాక్స్ లైట్లును సర్పంచి లలితో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో ముందంజలో ఉంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి చంద్రమ్మ, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, ఈఓ గౌస్, వార్డు సభ్యులు మల్లికార్జున, వాసుదేవుడు, ఎంబిసి కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేష్, ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు మూర్ఛవ్యాధి శిబిరం

**అనంతపురం కలెక్టరేట్ :** జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నేడు మూర్ఛవ్యాధి ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు జెవివి నగర కన్వీనర్ రామకృష్ణ, నగర అధ్యక్షుడు రామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టవర్‌క్లాక్ సమీపంలోని జెవివి కార్యాలయంలో నిర్వహించే మూర్ఛవ్యాధి వైద్య శిబిరానికి విజయవాడ నుంచి ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ శివన్నారాయణ హాజరువుతున్నట్లు తెలిపారు.

## పలువురికి పరామర్శ

**ఆత్మకూరు :** గాయపడిన పలువురితోపాటు మృతిచెందిన కార్యకర్తల కుటుంబాలను వైసిపి సీనియర్ నాయకులు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి పరామర్శించారు. ఇందులో భాగంగా మండలంలోని వేపచెర్ల పంచాయతీ దిగువ తండాకి చెందిన జగన్మోహన్‌నాయక్ మృతి చెందడంతో అనంతపురంలోని ఆస్పత్రికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి నివాళుర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే రోడ్డు ప్రమాదంలో గాయపడిన తలుపూరుకు చెందిన ఎర్రిస్వామియాదవ్‌ను పరామర్శించారు. అదేగ్రామానికి చెందిన వైసిపి నాయకుడు నాగిరెడ్డి భార్య అదిలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందడంతో మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

## జగన్‌ను అంబేద్కర్‌తో పోల్చడం సిగ్గుచేటు

**ధర్మవరం టౌన్ :** సిఎం జగన్‌ను మంత్రులు అంబేద్కర్‌తో పోల్చడం సిగ్గుచేటని టిడిపి ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కేశగాళ్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విజయవాడలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడాన్ని స్వాగతి స్తున్నామన్నారు. అయితే సిఎం జగన్ దళితులకు ఏ పథకం ద్వారా లబ్ధి చేకూర్చారో, ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఎపిలో భారత రాజ్యాంగం పోయి రాజారెడ్డి రాజ్యాంగం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ నాయకులు మొండి శీన, పోట్లమర్రి ఆనంద్, బడన్నపల్లి ఆది, పోతలయ్య, లక్ష్మీనారాణ, సుబ్రమణ్యం, బద్రీ పాల్గొన్నారు